క్లుప్తంగా

సీసీ రోడ్డు ప్రారంభం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని 2వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, కౌన్సిలర్లు మహేశ్వరి, శ్రీకాంత్, సాయిలు, డీసీసీబీ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



బాన్సువాడ: పాత బాన్సువాడ హరిజనవాడలో వర్షాలకు కూలిన ఇళ్లను ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు మాసాని శేఖర్‌రెడ్డి, మంత్రి గణేష్, గుడాల నగేష్, రెంజర్ల సాయిలు, నార్ల రఘు, గొల్ల వెంకన్న, దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

పారిశుధ్య పనుల్లో సర్పంచ్



బీబీపేట: మండలంలోని ఉప్పర్‌పల్లిలో గత కొన్ని రోజులుగా జీపీ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. దీంతో చెత్తను తొలగించేవారు లేక గ్రామంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. ఈక్రమంలో ఆదివారం సర్పంచ్ కాసర్ల ప్రసాద్ గ్రామ పంచాయతీ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల డిమాండ్లకు పరిష్కారం చూపాలని అన్నారు.

బస్టాండ్‌లో విద్యుత్ లైట్లు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అధికారులు విద్యుత్ లైట్లు బిగించారు. ఈ నెల 5న సాక్షి దినపత్రికలో 'పేరుకే బస్టాండ్..వసతులు నిల్..' శీర్షికన బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలపై కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఆర్టీసీ అధి కారులు స్పందించారు. బస్టాండ్ లోపల ప్రాంగణంలో ఎల్ఈడీ లైట్లు లైట్లు బిగించి, పరిసరాలను శుభ్రం చేయించారు. త్వరలోనే మూత్రశాలలు నిర్మించి ప్రయాణికులకు అన్ని వసతులు కల్పిస్తామని వారు తెలిపారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరసన దీక్షలు ఆదివారం 83వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యం విడుదల చేస్తున్న వ్యర్థాల నుంచి కాపాడాలంటూ డిమాండ్ చేశారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కందూరి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె విచ్ఛిన్నం చేయడానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి రూ. 3వేలు వేతనాలు పెంచుతామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

రోడ్డుభద్రతపై అవగాహన ఉండాలి

తాడ్వాయి: వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేదంటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి వాహనాలను నడిపినట్లయితే డ్రంకన్‌డ్రైవ్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం

పలు గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ





బాన్సువాడలో ఎల్లమ్మ ఆలయానికి బోనాలతో వెళ్తున్న స్పీకర్ దంపతులు.. బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

బాన్సువాడ: పట్టణంలోని సాయికృపానగర్ కాలనీలో ఆదివారం ఎల్లమ్మతల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. గుడి నిర్మాణానికి స్పీకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. బాన్సువాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ రమాదేవి, కాలనీ నాయకులు నారాయణరెడ్డి, భాస్కర్‌రావు, గురువినయ్ తదితరులు ఉన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు సిద్ధరామేశ్వర్‌నగర్‌లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు సంఘాల వారు మహంకాళి, భూలక్ష్మమ్మ అమ్మవార్లకు సిద్ధరామేశ్వరనగర్‌లో మైసమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దోమకొండ: మండల కేంద్రంలోని దుర్గమ్మకు ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి బోనాలను తీసుకువెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బోడపుంటి రవి, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ నల్లపు అంజలి, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, డైరెక్టర్ పోశయ్య పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కామారెడ్డి పట్టణంలో...



కామారెడ్డి పోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



సిద్ధరామేశ్వరనగర్ గ్రామంలో..



దోమకొండలో..



దోమకొండలో అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్న మహిళలు

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు





బాన్సువాడలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. నస్రుల్లాబాద్‌లో..

బాన్సువాడ: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆదివారం బాన్సువాడలో బీఆర్ఎస్ నాయకులు రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంజిరెడ్డి మాట్లాడుతూ.. కర్రను విమర్శిస్తే ఊరుకునేది లేదని అన్నారు. యకులు గురువినయ్, కృష్ణరెడ్డి, ఎజాస్, పాత బాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, జంగం గంగాధర్, శ్రీధర్, మోహన్‌నాయక్, గంగుల గంగారం, వెంకట్‌రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

నస్రుల్లాబాద్: స్పీకర్ కుటుంబం గురించి మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని ఎంపీపీ పాల్త్య విఠల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. అనంతరం రేవంతదిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, కిషోర్ యాదవ్, ఖలీల్, ప్రతాప్, మల్లేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె చేస్తాం





బీబీపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు.. రాజంపేటలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

లింగంపేట/ భిక్కనూరు/బీబీపేట/రాజంపేట: తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని జీపీ కార్మికులు పేర్కొన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో వారు చేపట్టిన సమ్మె ఆదివారం 11వ రోజు కొనసాగింది. లింగంపేటలో కార్మికుల సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు. రాజంపేట మండలంలో కార్మికులు భిక్షాటన చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.



లింగంపేటలో కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న బీజేపీ నాయకులు

చినుకు పడితే చీకటే

- చిన్నపాటి గాలివానకే కరెంట్ కట్
- చెట్లకొమ్మల్లో విద్యుత్ తీగలతో ఇబ్బందులు
- నస్రుల్లాబాద్ మండలంలో దుస్థితి



మైలారంలో చెట్ల కొమ్మల మధ్య ఉన్న వైర్లు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): వర్షాకాలం ప్రారంభం అవ్వడంతో నిత్యం చిరు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. అయితే చిన్నపాటి వర్షాలకు కరెంటు పోతూ ఉండడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుస్థితి నస్రుల్లాబాద్ మండలంలో నెలకొంది. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.



నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో..

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం..

విద్యుత్‌శాఖ అధికారులు ప్రీ మాన్‌సూన్ పనులు చేపట్టి వైర్ల కింద ఉన్న మొక్కలను తొలగించి, వైర్లకు పైన ఉన్న కొమ్మలను కొట్టి వేయాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం రోజుకు గంటల తరబడి కరెంటు కోత జరుగుతుంది. అర్ధరాత్రుల్లో వర్షం పడటంతో వర్షం తగ్గే వరకు అధికారులు కరెంటు సరఫరా చేయడం లేదు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ లైన్‌మెన్‌లు స్థానికంగా ఉంటున్నా, ఉన్నతాధికారుల ఆదేశాలు అందేవరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి, అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం..

■ శాకంబరీగా రేణుకా ఎల్లమ్మ



భిక్కనూరు: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మను ఆదివారం భక్తులు శాఖాంబరీగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

■ మూఢ విశ్వాసాలను వీడాలి



కామారెడ్డి అర్బన్: భక్తులు మూఢ విశ్వాసాలను వీడి సత్య, శాస్త్ర, వేద జ్ఞానాలతో సంస్కృతి సాంప్రదాయాలతో భావితరాలకు ఆదర్శంగా ఉండాలని బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యనంద స్వామి అన్నారు. విద్యానగర్‌లోని కాశీ విశ్వనాథేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆయన ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగం నిర్వహించారు. కార్యక్రమంలోగీతా మందిరం ప్రతినిధులు పాత అశోక్, అర్వపల్లి రమేష్, టంకరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

■ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



కామారెడ్డి అర్బన్: ఎన్జీవోస్ కాలనీలోని అంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం రామకోటి జపలిఖిత ప్రచారకులు కృష్ణనందస్వామి ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు గంగరాజం, భుజంగరావు, నాగరాజు తెలిపారు. ఈనెల 23న సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తామని, ఆసక్తిగల వారు 9247238688 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

■ భజన మండలి ప్రారంభం



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని లింగాపూర్‌లో ఆదివారం శ్రీసత్యసాయి సేవా సమితి కామారెడ్డిశాఖ ఆధ్వర్యంలో భజన మండలి ప్రారంభం, హరితహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు.

■ శబరిమాతకు ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవారి ప్రతిమ, దివ్యసమాధి, పాదుకల వద్ద వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కళాశాల కోసం సంతకాల సేకరణ

బీబీపేట: బీబీపేటలో జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం జూనియర్ కళాశాల సాధన సమితి సభ్యులు మండల కేంద్రంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల క్రితం మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డిలు హామీ ఇచ్చారని ఇప్పటికీ కూడా ఏర్పాటు చేయలేదని వారు అన్నారు. కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బీజేపీ 'టిఫిన్ బాక్స్ మీటింగ్'



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని గోర్గల్ గ్రామ బేడీల మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం బీజేపీ నాయకులు టిఫిన్ బాక్స్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులతో ఇబ్బందులు

లింగంపేట: మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ప్రతీరోజు రాత్రింబవళ్లు పశువులు రోడ్లపై పడుకుంటూ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై అడ్డంగా పశువులు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పశువులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నాయన్నారు. పశువులు రోడ్లపై ఉండకుండా యజమానులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈక్రమంలో ఆదివారం లింగంపేట ఎస్సైకి పలువురు పిర్యాదు చేయగా ఎస్సై శంకర్ రోడ్డుపై ఉన్న పశువులను గమనించారు. పశువుల యజమానులు తమ పశువులను ఇంటివద్ద కట్టేసుకోవాలని సూచించారు. లేదంటే గోశాలకు అప్పగిస్తామని తెలిపారు.



సమాచారం..

■ **దరఖాస్తుల ఆహ్వానం**

బిచ్కుంద(జుక్కల్): పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో అడ్మిషన్లు పొందవచ్చని, ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ కళాశాల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ వెంకటశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రెండు ప్రభుత్వ, మూడు ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయన్నారు. వివరాలకు బిచ్కుంద ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

■ **గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు..**

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లంక్యాంపు, కొయ్యగుట్ట వద్ద గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలల్లో ఎంపీసీలో ఎస్సీ విద్యార్థినులకు సీట్లు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ పద్మకుమారి, శోభారాణిలు వేర్వేరు ప్రకటనల్లో కోరారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు సంబంధిత ధృవపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

■ **నేడు మల్లుపల్లికి ప్రభుత్వ విప్ రాక**

భిక్కనూరు: మండలంలోని మల్లుపల్లి గ్రామానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం విచ్చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచ్ లలిత శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు.

■ **నేడు ఉచిత వైద్య శిబిరం**

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెడిసిటీ ఆస్పత్రి వారు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

■ **21న నాగిరెడ్డిపేట మండల సమావేశం**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఘు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

సంక్షిప్తం

సమగ్ర విచారణ చేపట్టాలి

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుట్రకోణం ఉన్నట్లు బీజేపీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ, మాల్యాద్రిరెడ్డి, కొత్తకొండ భాస్కర్‌లు ఆరోపించారు. ఆదివారం వారు ప్రమాద స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్త వడ్లశేఖర్‌పై గిట్టనివారు లారీ ప్రమాదం రూపంలో హత్యాయత్నం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

వాలీబాల్ కిట్ అందజేత

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆదివారం హెచ్ఎం సీతయ్య వాలీబాల్, నెట్ కిట్లను పంపిణీ చేశారు. వార్డెన్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ లక్ష్మీవెంకటేశ్వరాలయం పునః నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన వీరమల్లి భరత్‌రాజు తన తండ్రి రమేశ్ పేరిట రూ.11వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయకమిటీ సభ్యులు సన్మానించారు.

వనభోజనాలకు తరలిన ప్రజలు



దోమకొండ: మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు వనభోజనాలకు తరలివెళ్లారు. అంతకుమందు గ్రామంలోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

దోమలమందు పిచికారీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం దోమల మందును సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఉప సర్పంచ్ రవి, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు తరలిన బీఆర్ఎస్ నాయకులు

సదాశివనగర్/తాడ్వాయి/లింగంపేట: ఎల్లారెడ్డిలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమానికి వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. లింగంపేట్, తాడ్వాయి, సదాశివనగర్ మండలాల నుంచి నాయకులు ప్రత్యేక వాహనాల్లో ఎల్లారెడ్డి తరలివెళ్లి, ఉత్సవాల్లో పాల్గొన్నారు.

వీడీసీ కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి అర్బన్: మండలంలోని లింగాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం గ్రామస్తులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా ఎండీ షానూర్, ఉపాధ్యక్షుడుగా మంచాల రమేష్‌యాదవ్, కార్యదర్శిగా వడ్ల రవి, సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా సుఖ్‌దేవ్, ఉపకోశాధికారి సంగి స్వామి, సలహాదారులుగా కాశయ్య, మల్లేష్‌యాదవ్, రాజిరెడ్డి, లింగం, దేవాసాయిలు, శేఖర్, గంగుల నర్సారెడ్డి, గోపాల్‌యాదవ్, చిన్నరాజయ్య ఎన్నికయ్యారు.

యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జికి సన్మానం



కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆదివారం ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఏఐసీసీ జాయింట్ సెక్రెటరీ కృష్ణను, కామారెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్ సన్మానించారు. జిల్లాలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించినట్లు సందీప్ తెలిపారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

రాజంపేట: మండలంలోని ఎల్లాపూర్ తండాకు చెందిన బోడావత్ వినోద్ కుమార్ ఇటీవల ఓ ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడికి ఎల్ఐసీలో బీమా పాలసీ ఉండటంతో బాధిత కుటుంబానికి రూ.21,41,000 బీమా డబ్బులు మంజూరయ్యాయి. దీంతో ఆదివారం చెక్కును ఏజెంట్ శ్రీకాంత్ బాధిత కుటుంబానికి అందజేశారు.